11493

C
CP04T199

వేదము వేంకటరాయశాస్త్రులవారి యుపన్యాసాదికములు

గ్రామ్యాదేశ నిరసనము

69 D A



894.827
V46.

వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్.,
4. మల్లికేశ్వరస్వామిగుడి సందు, లింగిసెట్టివీధి,
జి. టి. మ ద రా సు.

0.40

VEDAM

Blank Page

A CP04T199

గ్రామ్యాదేశనిరసనము

వేదము వేంకటరాయశాస్త్రిచే

ఉపన్యస్తము.



వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్,
4 మల్లికేశ్వరగుడిసందు, లింగిసెట్టివీధి,
జి. టి. మదరాసు.

Blank Page

గ్రామ్యాదేశ నిరసనము.

" కామా ద్దిగే విప్రకర్ష త్యలక్ష్మీం
కీర్తిం సూతే దుష్కృతిం యా హినస్తి
తస్యా దేతాం మాతరం మద్గిరాణాం
ధేనుం ధీరాః సూనృతాం వాచ మాహుః."

గంగాదేవి నారాయణపాదమందు జనించి పరమశివునిచే మూర్ధంబున లాలితయై నగాధిరాట్ఛృంగంబున విలసిల్లి దిగి వచ్చి హరిద్వారవారణస్యాదులమీఁదుగా నానాదేశములం బవిత్రికరించి కడపట సకలకశ్మల సమృద్ధయై సముద్రమునంబడి తన్మయత్వముం బొంది అస్పృశ్యయై అపేయయై నష్టరూపయై పోయినట్లే వాగ్దేవియు పద్మజాతమనోజాతయై చతుర్వేదీమహితము లయిన యాచతుర్ముఖుని ముఖంబులందు విలసిల్లి వాల్మీకి వ్యాసకాళిదాసాదుల వదనంబులం బరిఢవిల్లి మనయాంధ్ర దేశంబునకుం దిగి తెలుఁగై రాజరాజనరేంద్ర కృష్ణరాయాదుల యాస్థానములయందు మహితయై నానాదిగ్దేశంబులం బవిత్రికరించి కడపటి నిక్కాలంబునం బ్రాయికంబుగా తెగులై సకల కశ్మలసమృద్ధయై గ్రామ్యప్రాయతం జెంది అనుచ్చారణీయయు అనాకర్ణనీయయు నై రూపహానిం జెందుచున్నది.

ఈచరమదశం బొరసిన సరణికి వివరణము.

చిరకాలము ఆంధ్రవాగ్దేవిని సంస్కృతాంధ్రోభయ భాషాప్రవీణులైనవాగనుశాసన సోమయాజి పెద్దనార్య ప్రభృ

తులు మహాకోన్నతదశయంద యుంచి పూజించిరి. ఇటీవల రాఁగా రాఁగా, ప్రాయికముగా, సంస్కృత మెఱుఁగని కవులు, చదువనికవులు, సమాసమొల్లనివారు, అలంకారము నొప్పని వారు, యతిప్రాసల హితశత్రువులు, అక్షరద్వేషులు, ఔచిత్య బాహ్యులు—ఏవమాదులు వాగ్దేవికి ఈచరమదశను సాధించి నారు.

ఈదశలో పిశాచము పట్టినప్పుడు చిల్లంగిప్రయోగము వలెను, గోరుచుట్టుపై రోకటిపోటు చందమునను, భావి వాజ్మయము నెల్ల గ్రామ్యతం బొరయింప నొకయుద్యమము తలసూపి యున్నది. ఆ గ్రామ్యవాదుల వాదసారము ఇదిగా కానిపించుచున్నది.—

"వ్యాకృతభాషకఠినము; దానివ్యాకరణము దుర్బోధము; తదీయశబ్దజాలము బహుళముగా గ్రంథమాత్రప్రసిద్ధము; వ్యాకరణము వ్యావహారికభాషానుగుణముగాదు, అందులకు కర్తృక భవిష్యదర్థక పడు కలానుబంధములు ఉదాహరణములు.

గ్రామ్య మన్ననో, సులువు, సర్వజనవిదితము.—

ఇటలీలో డాంటిమహాకవి వ్రాసిన 'డివైన్ కామెడీ'ని ఉదాహరణముగాఁ గనవచ్చును. గ్రామ్యములో ఇప్పుడు రచితము లయిన యేతన్మతనిర్వాహార్థపత్రికావ్యాసములను, పఠనీయపుస్తక సభవారు (Text-book Committee) పాఠశాలలకు నిర్ణయించి నట్టి కొన్నిగ్రామ్యగ్రంథములను, ఉదాహరణముగాఁ బరికింప వచ్చును"

ఇందులకు సమాధానము.—

అగ్రామ్యవాఙ్మయము కఠిన మనుట యిప్పుడు పుట్టిన మాట, పూర్వులు దీనిని కఠిన మనలేదు, 'లెస్స' యనిరి.

'ఎల్లభాషలందు నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.'

అని యాంధ్రభోజుఁ డయిన శ్రీకృష్ణదేవరాయఁడు 'లెస్స' యని చెప్పి, తెనుంగున ఆలెస్సదనమునకు ఉదాహరణముగా ఆముక్త మాల్యదను రచించెను. 'ఆడి' యనియెను గాన 'ఆలెస్సఁదన మును' గ్రామ్యమునకే చెప్పె నందుమేని, ఆచెప్పిన వాక్యము గాని అది కలగ్రంథముగాని అగ్రామ్యమందే యున్నవి గాని గ్రామ్యమందు లేవు, కావున ఆపొగడ్త అగ్రామ్యమునకే అనుట విశదము. మఱి యిప్పటి యీ కాఠిన్యమునకుం గారణము తెలిపెద.

ఆంధ్రభాషాప్రవచనమందు—

(1) ప్రాచీనమార్గము (2) నవీనమార్గమును రెండు. ప్రాచీనమార్గమును అనులోమమార్గ మనం దగును. అమరము, ఆంధ్రనామసంగ్రహము, సంస్కృతశబ్దమంజరి, సంస్కృతపంచ కావ్యములు, నన్నయభట్టీయము, ఆంధ్రపంచకావ్యములు ఈ వరుస ప్రవచనము ప్రాచీనమార్గము. ఇందలిక్రమము—శబ్దము లక్షణము లక్ష్యమునుం గా నున్నది. నవీనమార్గము రాజకీయ విద్యాంగ నిర్ణీతమార్గమే; ఇది ప్రతిలోమ మనం దగినది; ఇందు వరుస—లక్ష్యము లక్షణము శబ్దమునుగా నుండును.

ఈనవీనమార్గము మనభాషకు పనికి రాదు:

పెల్లుగా ప్రత్యయఘటన, శబ్దముతో శబ్దము సంధివశ మునను సమాసవశేమునను కొంతవఱకైనను అదుకుటయు కల యుటయు, భూయిష్ఠముగా సంస్కృతపదంబులం గైకొనుటయు, వ్యవహారములో రాని తద్భవాదులం బ్రయోగించుటయు, ఇత్యాదికారణములంబట్టి ఇందుదృఢపాండిత్యముకై అనులోమ మార్గమే అనుకూలముగా నున్నది. దీనివలన క్లేశమును కాల మును కరము సంక్షిప్తము లగును. ఈగుణముం గననేరక విద్వాధ్యక్షులు ఈమార్గముం దొలఁగించి ఈ భాషకు అసమర్థమైన యేతద్విపరీత నవీనమార్గమున ఈభాషం జెప్పించుటచేత ఇది ఆదినుండి కఠినమే అగుటయు, ఎన్నాళ్లు చదివినను పాండిత్యము సున్నయే యగుటయు, పాఠశాలల విద్యార్థులు పెద్దలయిన తర్వాత బుద్ధివికాస మొందిన యనంతరము విషయవిశేషములు తెలిసికొని ఆంధ్రగ్రంథరచనాభిలాషం బొంది గ్రంథములు వ్రాయుటలో పెక్కుదోషములు చేయుటయు, సరియైనశబ్దము 'బాల్యఁడో' 'బాల్యత్వఁడో'యని తాము సంశయించుటయు, తప్పున్న వారిని తెగువ గలిగి తిట్టం దిట్ట లయినవారు 'బాల్యఁ' డని యేని 'బాల్యత్వఁ' డనియేని ప్రయోగించుకొనుటయు, సంభవించుచున్నవి.

మఱియు మునిపీఁగారిగంట బాలురకు విహారసమయ ముగా పరిణమించుటచేతను,ఆగంటలో మునిపీఁగారికడకు సాధ్య మయినంతవఱకు రాకుండనే పలుపురు బాలురు బీడీలతోనే

కాలము గడుపుటచేతను, వచ్చినవారు మునిషీగారిని వేళాకోళ ములు చేయుచు చమత్కారములయందును చిలువిషముల యందును గంటం బుచ్చుటచేతను, వారిని దండించుటకు మునిషీ గారికి అధికారము లేనందున మునిషీగారు ఇంగ్లీషుపాధ్యాయుని మోములు మొఱవెట్టుకొనవలసి యుండుటచేతను, వీరిపాఠంట ఇంగ్లీషుపాధ్యాయునికి విశ్రామంగా నుండుటంబట్టి వీరి మొఱను వారు అక్కఱతో నిరంతరము విచారింపనందునను, పయిగా తెలుఁగులో జయ మొందమి పైతరగతికి పోవుటకు ఆటంకపడమిచేతను, ఇ ట్లుగఁబ్రాకఁగా ప్రాకఁగా యీని వర్నిటీ పరీక్షలయందు తెలుఁగులో జయము అతిసులభ మగుట చేతను, అందులకై యీయధమవిద్యార్థులు కూడ చదువనే అక్కఱ లేమిచేతను, విద్యార్థులవ్రాత లెట్లున్నను జయములో మామూలు 'పర్సెంటేజి' ప్రతివర్షము తప్పనందునను, పాఠగ్రంథ ప్రశ్నపత్రము (Text Paper) నకు యథాశక్తి ఇంచుకంత యుత్తరము వ్రాసి భాషాంతరీకరణ ప్రశ్నపత్రము(Translation Paper)నకు మాత్రము ఉత్తరము విపులముగా నేనియు, లేక, ఆంధ్రీకరణమాత్ర మయినను వ్రాసి, పరీక్షయందు జయ మొందుట ప్రాయిక మయి యుండుటవలనను, సర్కారు కొలువునకు తెలుఁగులోని తెలివితో పని లేనందునను, తెనుఁగు చక్కఁగా తెలిసినచో మునిషీలమై పోదు మేమో అని విద్యార్థులకును అట్లయి పోదు రేమో యని వారితండ్రు లకును దిగులు కలిగియుండుటచేతను, పరీక్షలు ముగిసిన యనం

తరము తెలుఁగుమొగము నెవ్వరుం జూడమిచేతను, తెలుఁగు రానివారు తెలుఁగునకు అధ్యక్షు లగుటచేతను, వైద్యము - ఎంజినీరింగు - లా మొద లగు విద్యలయందును న్యాయస్థాన ములయందును తెలుఁగుపాండిత్యమువలన ప్రయోజనము లేనం దునను, పాఠశాలలయందు బాలురకు భాషేతర సకల విషయ ములను తెలుఁగునం జెప్పక యింగ్లీషునం జెప్పుటచేతను, ఒకటి రెండుషారము లయినప్పటినుండి 'మాఫాదరుగారు' అనుటలో గౌరవంబును మానాయనగా రన్న మానహానియు కలుగుటచే తను, మునిపీగారికి 15 రూపాయలే జీత మగుటచేతను, అపండి తులు తమయింగ్లీషువ్యాసములలో శుష్కస్తనీకంచుకన్యా యంబున పండితులను కడుం దిట్టుటచేతను, ఈభాష యిప్పుడు కఠిన మయినది.

ఆంగ్లభాష సులువనుట దానిని సాధించుటకై తాము పడినప్రయాసను మఱచుటచేత; కావున, ఆసాటి కొఱగాదు.

మఱియు పూర్వోక్తాపవ్యత్పన్నాధునికుల పాఠగ్రంథ ములనుకూడ యూనిర్సిటీపరీక్షలకు పఠనీయములనుగా నిర్ణ యించుటచేతను, గ్రంథములను నిర్ణయించిన పిమ్మట ఆగ్రంథ కర్తలు ప్రథమముద్రణమును దాఁచి వేనవేలు తప్పులు దిద్దించు కొని ద్వితీయముద్రణముం గావించి ఆద్వితీయముద్రణమునే విద్యార్థుల కిచ్చినను అట్టిగ్రంథములం జదువుటవలన అంబలి త్రాగువానిమోఁచేతి క్రింద నోరొగ్గినవానికథగా ఉన్నమతియుం బోవుటచేతను, పరిక్షాగ్రంథములలో పదిపద్యము లయినను

చదివినాఁడా - పదచ్ఛేద విధాన మయిన నెఱుంగునా - పది పద్యముల కైనకు లక్షణావిరుద్ధముగా అర్థము చెప్పఁగలఁడా - లక్షణగ్రంథము ఏ మైన చదివినాఁడా - అను విషయములను మూలం ద్రోచి - ఒజ్జలు నేర్పు జిత్తులచేత అర్థకల్పముగా నుత్తరము వ్రాయం దగు ప్రశ్నపత్రముల నిచ్చుచుండుట చేతను, ఎట్లు వ్రాసినను 100 కి 80-90 మందికి జయము తప్ప నందునను, ఈకాఠిన్యము కలిగినది.

ఈవిపరీతము నరయవలయును.—కఠినము కఠిన మను వాదము ఒకప్రక్క లేచుచున్నది; మఱియొకప్రక్క పరీక్షలందు అక్షతముగా ఏకరీతిగా నూటికి 80 గురో 90 గురో ప్రతిసంవత్సరము జయ మొందుచునే యున్నారు.

కావున పైపొరఁబాటులను సవరించుకొనినయెడల ఈ మిథ్యాకాఠిన్యమిథ్యాసౌలభ్యములు తొలఁగును.

మఱియు ఆంగ్లభాషా పాఠపుస్తకములందు, కాకి గద్ద కోడి గాడిద ఇట్టివానిని గుఱించిన పాఠములు ఆభాషయల వడుటకై అనుకూలములే గాని, 'ఆవు పాలు ఇచ్చును.' 'కాకి నల్లనిది.' 'కోడి కూయును.' 'ఏనుఁగు భూమికి ఎనిమిదియడుగుల యెత్తున నున్నది.'—ఇట్టి తెలుఁగుపాఠములు మనబాలుర కేల? తేయాకు కాపి కండచక్కెర సగ్గుబియ్యము వీని స్వరూపవర్ణనలచే భాష కేముపకారము? ఈ విషయములే ఆంగ్లపాఠపుస్తకములలో కలవు గదా, వీనినే తెలుఁగు పాఠపుస్తకములలో చెప్ప నేల? ఆంగ్లభాషను చదువనివారికై పనికివచ్చు నందురేని

వచ్చుఁగాక, ఈకాలమున చదువువారిలో అట్టివారుం గలరా? కలరేనియు వారికి ఇంతకన్న మంచి యుపయుక్తవిషయ ములు చెప్పదగినవి లేవా?

గణితాది శాస్త్రములను సయితము ప్రాయికముగా ఆంగ్లభాషయందే చెప్పుటచేతను, కొన్ని చోట్ల ఆంధ్రమునే చెప్పినను ఆగణితాదిగ్రంథములు గ్రామ్యరచనలై ప్రసిద్ధాంధ్ర పదస్థానమునం గూడ ఆంగ్లపదభూయిష్ఠంబు లై యుండుటచేత ను, 'అరిత్థ్మటిక్కు' సులువు 'వ్యక్తగణితము' కఠినము, 'అల్జెబ్రా' సులువు 'అవ్యక్త గణితము' కఠినము, 'సర్కంఫరెన్స్' సులువు 'పరిధి' కఠినము, 'సర్కిల్' సులువు 'వృత్తము' కఠినము, 'పర్పెండిక్యులర్' సులువు 'లంబము' కఠినమును, అయినవి. గ్రామ్యాంకగణితమునుండి కొన్ని యుదాహరణములు:—

లాంగ్మేన్స ఇండియన్ ప్రాక్టికల్ అరిత్ మెటిక్ లు:—

6. పు. 'మొదట జ్యామెట్రిలో డిఫినిషన్లు చెప్పవద్దు' 'కుట్టివాళ్లు బొమ్మలను ప్లానులను తనిఖీచేసి రూల్లు కనుకోవడముఅలవాటు చేయించు.'

11. పు. 'దగ్గిరనుంచీ వాటిలో కావలసిన రూల్లు...లెక్కలు చెప్పవలెను. రూల్లు పిల్లలకు చెప్పనక్కరలేదు.' '2 పిక్కలు+3 పిక్కలు=ఏ పిక్కలు.'

13. పు. 'డ్రాయిజ్'

15. పు. 'ప్రాబ్లెము.'

25. పు. 'ఒకబల్లమీఁద 2 నాట్లు కొట్టి వాటిమధ్య ఒక దారము వదులుగా పట్టుకో.' 'ట్రేసు కాగితముతోటి ఇది సమరేఖ అవునో కాదో

చూడు.' 'బోర్డుమీద దారమునకు సుద్ద వ్రాసి.' '2 పాయింట్లను కలిపి.' 'దారమునకు జేగురు వ్రాసి.'

30. పు. 'భూమిమీద అయినా గోడమీద అయినా 10 అడుగులు పొడుగుగల గీత గీసి సరిగా 2 అడుగులు పొడుగుగల కట్టిను.'

45. పు. 'అణాకు పది అళ్లీలు అని చెప్పా'

48. పు. 'ప్లైక్లాసులలో న్యూమరేటరు, డినామినేటరు అనే మాటలున్నూ, డెఫినిషనున్నూ, చెప్పడము సులభము.'

53. పు. 'దమ్మిడీకి లావు అళ్లీలు వస్తవా కానీకి లావు నస్తవా?'

87. పు. 'మొదటి నోటు.' 'మూడవభాగములోని సిలబస్సు.'

93. పు. 'మిగిలిన లెక్కలు 3-వ స్టెప్పులో చేయుటకు తగినవి.' 'లోని లెక్కలు చివర స్టెప్పులో చేయుటకు పనికి వచ్చేవి.' 'మొదట వచ్చిన ఆన్సరుయొక్క' 'ఇంప్రాపర్ ఫ్రాక్షను అయినప్పుడు ఆన్సరును మరి ఒక మోస్తరుగా వ్రాయవలెను.' 'మిక్స్డ్ నంబరుగాని అయినప్పుడు ఆసంఖ్యను, ఇంప్రాపర్ ఫ్రాక్షనుగా మార్చడము అగత్యము.'

95. పు. 'లెఖ్కలయొక్క పర్కజ్ వ్రాయడమే.' 'ఆంగిలులు.'

98. పు. 'నోటులో సైన్సు మొదలయిన కొన్ని జ్యామెట్రీ, అరిత్మెటిక్‌లలో వచ్చేమాటను వ్రాసినాము.'

[ఈ యుదాహృత వాక్యములలో 'డ్రాయిజ్' అన్నట్లుగానే 'ప్లానను' 'ట్రేస్', 'బోర్డ్', 'న్యూమరేటర్', 'డినామినేటర్', 'డిపినిషన్నూ', '(మొదటి) నోట్', 'సిలబస్', 'స్టెప్లో', 'ఆన్సర్‌యొక్క', 'ప్రాక్షన్', 'ఆన్సరును', 'నంబర్డాని', 'ప్రాక్షన్లా', 'నోట్లో',—అని యేల వ్రాయ లేదో తెలియ కున్నది. మఱియు, 'రూల్లు' అన్నట్లుగానే 'క్లాస్లలో', 'అంగిల్లు', అనమి యెందులకో?

'ప్రాబ్లెమ్లు' అన్నట్టు 'సైన్లు' అనక 'సైన్సు' అనుట యెందులకో?
'లెక్ఖలు', 'లెఖ్ఖలు' లెక్కలు అనుట తప్పుగాబోలు.

'జ్యామెట్రి' 'జ్యామెట్రీ' అని హ్రస్వదీర్ఘాంతములుగా ఇరుదెఱం గుల ప్యవహార మెట్లో? డిఫినిషన్, డెఫినిషన్, అని ఈగ్రామ్యములో రూప ద్వయము కలుగనేల? 'స్ట్రెట్ లైన్' అనక 'సమరేఖ' అని వాక్యమును చెఱిచి నారు! సుద్ధవ్రాయుటయు, జేగురువ్రాయుటయు ఆంధ్రులు ఇంకమీద నేర్చు కోవలసినవి.]

ముతియు ఈ స్రష్టలు నిజప్రతిజ్ఞాత మయిన గ్రామ్య స్వరూపమును సరిగా సాక్షాత్కరించికొననేరక, 'బొమ్మలను' 'చేసి', 'కావలసిన' 'పిల్లలకు' 'దారము' 'గిసి' 'సులభము' 'భాగములోని' 'చేయుటకు' అని అగ్రామ్యరూపములను వ్రాసి కొని గ్రామ్యరచనకుం గూడ కొఱగాకపోయినారు. ఈ శబ్దములు గ్రామ్యమందు ఎట్లుండు ననఁగా—'బొమ్మలని' 'చేశి', 'కావలశిన' 'పిల్లలకి' 'థారం' 'గీశి' 'సులభం' 'భాగంలో' అని యుండును. 'చేయడానికి' అనుటకు బదులుగా 'చేయుటకు' అనియు 'థారా నికి, అనుటకు బదులుగా 'దారమునకు' అనియు 'రాశి అనుటకు వ్రాసి' అనియు వ్రాయుట ఈగ్రామ్యమునకు నిర్ఘాతపాతముగా నున్నది.

ఈ నవీనాంధ్రమునకు వ్యాకరణము వ్రాయవలయు నన్న వాగనుశాసనుని కైనను శక్యమా? వీరు భాషను సులువు నేయుచున్న విధము తేటపడుచున్నదా? ఇది యేలోక మేమదీక్ష యో చెప్పవలయునా? ఇంతకన్న ఈగ్రంథమును ఇంగ్లీషులోనే వ్రాసిన మేలు. దీనిని పాఠశాలలలో బాలురకు చెప్పుచున్నారు, ఆవృత్తాంతమును తండ్రులెఱుఁగక సంతోషించుచున్నారు.

ఇది యాధునిక గ్రామ్యపాఠగ్రంథముల నైలికి దిక్పి దర్శనము.

ఉదాహరణార్థముగా గ్రామ్యవాదులు ప్రకటించినట్టివి పిచ్చుకను కాకిని సంబోధించెడు "పిచ్చుకా పిచ్చుకా కచ్చిక తింటావా" లోనగునవి గ్రామ్యాభాసములు. ఇవి వాస్తవ గ్రామ్యములో 'పిచికా పిచికా కచకని తింటావా?' అని పెద్ద వానిబాసలోను 'కచికా కచికా పిచికని తింతావా?' అని పసిబాలునిబాసలోను ఉండును. ఈ చిన్ని వ్రాఁతలు అగ్రామ్య ప్రాయములే అగుటచేతను, అంతిమ రచయితల యగ్రామ్యా భాసములకు ఇంచుమించుగా సరిపడుటచేతను, వానికటుత్వా పటుత్వములు అపండితులకు స్ఫుటము గాక యున్నవి.

ఇంతమాత్రాననే అగ్రామ్యస్థానమున గ్రామ్యము నా దేశించుట - కుప్పదిబ్బ నెక్కి నిక్కి నలుదిక్కులు చూచిన మాత్రాన కుక్కను రాజసింహాసనమునం గూర్చుండఁ బెట్టుట గా నున్నది.

పూర్వము ఇటలీలో 'లాటిన్ గ్రామ్య' మయిన యప్పటి 'యిటాలియను' భాషలో 'డాంటి' కవి 'డివైనుకామిడీ' యను గ్రంథమును వ్రాయ లేదా-అనియు, 'చాసరు' లోనగు వారు వ్రాసిన ప్రాచీనభాషారూపమును త్యజించి ఆంగ్లేయులు ఇప్పటి వ్యవహార సిద్ధాంగ్ల భాషలోనే గ్రంథములు వ్రాయుచుండ లేదా - యనియు, గ్రామ్యవాదులు వాదించుచున్నారు.

లాటిను మాని డాంటి ఇటాలియనులో వ్రాయుట మన పూర్వులు సంస్కృతమును మాని యాంధ్రములో గ్రంథము లను వ్రాయంబోడంగుట వంటిదిగా గ్రహింపవలయునుగాని, అగ్రామ్యస్థానమున నిర్బంధ పూర్వకముగా గ్రామ్యము పెట్టుట వంటిదిగా నెన్నఁదగదు. ఏల యన రసజ్ఞులు కారణవిశేష ములం బట్టి గ్రామ్యమందు గ్రంథములను వ్రాసికొందురు గాక. బొబ్బిలిపాటయు దేశింగురాజుపాటయు గ్రామ్యములే గదా. ఆరాధ్యమల్లన రచించిన జంగాల బొబ్బిలిపాటలోని రసములో శతాంశ మయినను రంగరాట్చరిత్రపద్యకావ్యమున లేదు. అవి దొరకనందున మదీయప్రతాపరుద్రీయమునుండి యుదాహరించెద.—

"మంగళ్లo.—[చాకళ్ల వీఁపుమీఁద తాళము వాయించుచు].

పాట.

లాయిరే గంజాయిరే సారాయిరే మాహాయిరే,
లాయిరే గంజాయిరే సారాయిరే మాహాయిరే.
సాకలోళ్లూ సచ్చి పోతే, మంగలోళ్లూ మాయి పోతే,
శిల్లిగవ్వ శెల్లనంత శీమ లేలేసామి కంత. లాయిరే.

చాకళ్లo.—[మంగళ్ల వీఁపుమీఁద తాళము ఊదుకుచు]

లాయిరే.....

సాకలోళ్లు సావ కుంటే, మంగలోళ్లు మాయ కుంటే,
శిల్లిగవ్వ శెల్లినంత శీమ లేలేసామి కంత. లాయిరే.

మీ మంగలి డప్పంక బుద్ధి పోయింది గాదురా! 'సచ్చిపోతే, అనిరా పాట్టం?"

[ఇందురాజునీతి యున్నది]

మంగళ్లు.—మీసాకలిబుద్ధి కాలా, యీపులు యిరిగి పోయినయిరా, రేవుతాళం యేశినార్రా గాడిదలూ! [అని వీపు తడవుకొందురు.”

“అందఱు.—వవ్వా! కొండాయా!

[అందఱు ప్రక్కప్రక్కను ఎదురెదురుగాను నిలిచి ఒకరిముఖము ఒకరి ముఖమునకు తగులునట్లుగా చేర్చుచు మహా వికృతహాసములతో, నేత్ర వికాసములతో, మహాభినయముతో వికట నృత్యముతో పాడుదురు.

కైకా సూశి మోగించినడు రాసావోరి పడుసు,
ఆ రాసావోరి పడుసు,
ఆ రాసావోరి పడుసు,
ఆ రాసావోరి పడుసు.

కోకా సూశి మోగించినడు గోసాసింగు పడుసు,
ఆ గోసాసింగు పడుసు,
ఆ గోసాసింగు పడుసు,
ఆ గోసాసింగు పడుసు.

గోడా గోడా దాన్నే గీశి గూబాల్యా సూశినడు,
ఆడు కొంగాల్యా సూశినడు,
ఆడు కోడ్యాల్యా సూశినడు,
ఆడు కోత్యాల్యా సూశినడు.

కూడో గ్గేశి నీలో గ్గేశి కొండాడు యెల్లినడు,
ఆ కొండాడు యేగినడు,
ఆ కొండాడు సాగినడు,
ఆ కొండాడు సచ్చినడు.

[అని నిష్క్రమించి, నేపథ్యమున దానినే పాడుచు తొలఁగుదురు.

[ఇందు దక్షిణనాయకుఁడయిన రజకసరసుని యనంగదశలు వర్ణితములు. అంతిమావస్థయు త్యక్తముగాదు.]

అట్లే గ్రామ్యమున సుద్దులును కథలును గద్దెలును రసవంతములు గలవు. 'వాక్యం రసాత్మకం కావ్యమ్'ని గదా విశ్వనాథ కవిరాజు అనుశాసించినాఁడు. అది హృదయంగమముగాని, బాలుర పాఠపుస్తకములను గ్రామ్యమున వ్రాయుటయు, ఆగ్రామ్య పుస్తకములను బొరతనమువారు నిర్బంధపూర్వకముగా పాఠశాలలో చదివించుటయు, అసమంజసము. డాంటి ఆప్రకారము నిర్బంధపూర్వకముగా తన మార్గమును దేశమున నెలకొల్పినాఁడా?

ఆంగ్లభాష అవిదితముగా దినదినమునకును సంస్కార విశేషములచేతను ప్రాజ్ఞవ్యవహారబలముచేతను మాతృ భూత్తమదశకు వచ్చిన మాట సత్యమే. అట్లే ఆంధ్రంబును అజ్ఞాత పూర్వతరాంధ్రగ్రంథ రచయితల' చాసయ' తెలుఁగుదశలోనుండి సంస్కార పరంపరా విశేషముచేత నన్నయాదుల 'తెన్నిసను' తెనుఁగుగా పరిణమించినది. అట్టి యుత్తమదశకు వచ్చియున్న యగ్రామ్యాంధ్రభాషను సర్వలక్షణనేతూచ్ఛేదకనుగా యథేష్టముగా విశృంఖలముగా, దినదిన వికల్ప్యమాన స్వరూపముగా మార్చుట ఉచితముగాఁ గానిపింపదు.

ఆంగ్లేయుల గ్రాంథికభాషకును వారిలో గొప్పవారి సంభాషణభాషకును భేదము లేదనియు, అట్లేమనకును ఉండవలయు ననియు, తదర్థమై గ్రంథములను మనము భాషించు రీతినే వ్రాయవలయు నని హితోపదేశము చేయుచున్నా మని గ్రామ్యవాదులు వచింతురు. అందులకు నా సమాధానము.-

మనమే గ్రాంథికభాషలో మాటలాడ నేర్చుకొందుమేని ఈ లోపము తొలఁగు నని. గ్రాంథికభాషాకల్పముగా సంభాషింప నేర్చి యుండుటచేత ఆంగ్లేయులకు స్వభాషణమును ఉత్తమ రూపమునం గాపాడుకొనుటయందలి యాసక్తియు, అందుకై వారు విద్యాసంస్కారశ్రమను వహించుటయు, వారిలో ప్రాయికముగా ఎల్లవారును స్త్రీలు కూడ చదివినవారుగానే యుండుటయు, వారిలోను బండివాండ్రు లోనగు గ్రుక్కడులు పైవారి వలెఁగాక వేఱుగా గ్రామ్యమునే భాషించుటయు, గొప్పవారు సయితము తమవాగ్వ్యవహారములలో కొన్నిటిని ‘కల్లోక్వియల్’ అని ‘స్లాంగ్’ అని గ్రంథానర్హముగా తొలఁగించుటయు ప్రసిద్ధము గదా.

ఇందువలనం బయల్పడిన విశేష మేమన:—

వారి యుదాహరణము మనకు గణనీయమయేని వారి గ్రంథములకు వారి కల్లోక్వియల్ స్లాంగులు పనికిరా కుండఁగా మనగ్రంథములకు మాత్రము మనకల్లోక్వియలు ఏల పనికి వచ్చును? అందులో మనగ్రంథములకు మన కల్లోక్వియలే వలయు ననుట మఱియు విపరీతముగా నున్నది. వారు సంభాషణలయందు గ్రంథభాషాకల్పతను కాపాడుకొనుట వారి మహోన్నతదశకును మనము మన సంభాషణలయందు అగ్రామ్యగ్రంథ దూరమును సాధించుట మన మహాధమ దశకును గల కారణములలో నొకగొప్ప కారణ మని నాయభి

ప్రాయము. ఏకరూపభాష ఐకమత్యానుకూలము, ఐకమత్యము వలన బలము, బలమువలన కార్యసిద్ధి, సిద్ధివలన మహోచ్చదశ. మన దేశమును తెలుఁగులు, వారిని గొట్టి యఱవలు, వారిం గొట్టి మరల తెలుఁగులు, ఇట్లే తెలుగులు ఓఢ్రులు చాళుక్యులు కర్ణాటకులు తురకలు ఇంగిలీసువారును ఏలుచు వచ్చినందునను, ప్రాయికముగా బ్రాహ్మణేతరులు చదువెఱుంగమిచేతను, ఆంధ్రవిద్యాపారగులు ప్రాయికముగా కతిపయ బ్రాహ్మణులుమాత్రమే అయియుండినందుననను, లోకములో ఈభేదము ఎక్కువ యయినది. ఇక్కాలమున ఆంగ్లేయుల ప్రభుత్వములో సకల పాఠశాలలయందును గ్రాంథిక భాషనే ఎల్లజాతులకును వారు చెప్పించుచున్నను, ఇప్పటికిని ఆభేదము తగ్గమికిని హెచ్చుచునే యుండుటకును కారణము లే వనఁగా ఆపాఠశాలలు దేశమునకు చాలమియు, ఉన్నపాఠశాలలయం దేమియు సర్వాధ్యక్షు లయిన దొరలు సి. పి. బ్రౌను దొరవారివలె ఆంధ్రభాషా మహాపండితులును తదుద్ధారకులును గాక తదనభిజ్ఞులై యుండుటంజేసి ఆంధ్రభాషా బోధనము ఆపాఠశాలలయందు చక్కఁగా నెఱవేఱమియు, దొరతనమువారు ఎంతమంచి మనస్సుతో తోడ్పడినను భాష దినదినమునకు దీనదశకు వచ్చినది. ఈ యభిప్రాయమునే కడచిన జనవరిలో 'ఇండియను పేట్రియాటు' లో పత్రికాధిపతిగారు వ్రాసియున్నారు. వారి వాక్యముల నుదాహరించెద:—

"Oriental learning as time advances, must further decline from the position in which we find to-day, the same circumstances of life and living prevailing. It is no use attempting to conceal the fact that it is not only Sanskrit education that is in need of revival. Even our vernaculars are dying out. The cry is that Telugu and Tamil and Malayalam and Canarese are not so well read and so well taught. And it is not strange, because neither Sanskrit nor the vernaculars can help a man to fight the battle of life. The first great desire is to learn the English language, to learn it as well as possible. It is a vast language, it is the language of the rulers. It is the vehicle of the thoughts of the day. It is in requistion every-where and in every branch of human activity, except in the branch of activity known as priesthood. The Hindu priest need not know the English language. But with the passing of the Civil Marriage Bill, the priest may find his occupation gone, and he too will have to take to the English language. In the field of Medicine, the English system is gaining through. And with the passing of Acts like the Medical Registration Act of Bombay, the Hakims and Ayurvedic Doctors will be less numerous than they are at present. There will, therefore, be lesser inducement to study Sanskrit than now. Simply for the sake of knowledge, there will not be many to pursue it; there will be still less to pursue so difficult a language as Sanskrit, for no other practical purpose than an exhibit in society, to which we may occasionally

point our finger and say: 'He is a well read man, well-versed in ancient lore;' we may perhaps bow our head to him with respect, but even in our Municipal Councils we would no more value the opinion of the man than that of a child, and his own grand child will think itself greater if it can spell the English language.

The Hon'ble Mr. P. Kesava Pillai has given notice of two resolutions to be moved at the Legislative Council meeting to be held on the 14th instant. They relate to the increase of pay to the Karnams and to the Tamil, Telugu and other language Pandits in the Colleges and Schools."

ఈయాంగ్లేయ వ్యాసకావయవములవలన ఈముద్రాభిప్రాయములు మదేకమానస వికల్పితములు గా వనియు సర్వజ్ఞనీనము లనియు తేటపడుచున్నది. భాషను పండితులను మంచిదశకు తెచ్చుటకు గౌరవవంతు లైన కేశవపిళ్లగారు యత్నించుచుండఁగా భాషను పండితులను ఈ గ్రామ్యవాదులు నిర్మూలించుచున్నా రనియుం దేటపడుచున్నది. దొరతనమువారు సదాంధ్రమును ఎల్లవారికిని నేర్పింపఁగడంగియుఁ గడంగకముందే 'ఇదిగోపండు ఇదిగో హాళిక్కి' యన్నట్లు ఈగ్రామ్యాదేశ మొకటి సంభవించినది. ఇందువలని విశేష మేమనఁగా, **'Not so well read and not so well taught.'** అని లోకాభిప్రాయ ప్రకాశకు లయిన పత్రికాధిపతులు ఇప్పటికే చింతిల్లుచున్న యీభాషకు, ఈగ్రామ్యాదేశముచేత చదు

వనే నేర్పనే అక్కఱలేనట్టి అనఁగా **"Will not be taught & will not be read."** అనునట్టి శోచనీయతమదశ సంభవించుచున్నది.

మనవారిలో గొప్పవారు ప్రాయికముగా పైఁ జెప్పిన యట్లు చక్కఁగ నేర్వని నేర్పని యీ భాషను పరీక్షలం దేరిన పిమ్మట త్యజించి ఆంగ్లేయభాషయందు ఆంగ్లేయులం గూడ భ్రమఁ జెందించునట్లు ఉపన్యాసములు చేయను వ్రాయను సమర్థ లయ్యెను స్వభాషయందు అగ్రామ్యముగా కాదు సరిగదా, గ్రామ్యముగా నయినను, ఉపన్యసింపను వ్రాయను అసమర్థులై యున్నందులకై వారు చింతింపవలయును. స్వభాషను అగ్రామ్యముగానే ఆంగ్లేయభాషనుంబోలె నేనియు వలసినప్పుడు నోట వ్యవహరింప నేర్వవలయును. తాము పరభాషయందే ఇంత మహావిద్వాంసు లయి యుండుటయే తాము మనస్సు పెట్టినచో స్వభాషయందు మహోన్నతు లై దానిని నన్నయ తిక్కనాదులకన్న మహోన్నతదశకుం దే సమర్థులనుటకు తార్కాణము. మఱి యిప్పుడు తమకు సాధ్యము కాదేని తమపుత్త్రులు తమపాటియేని సదాంధ్రము నెఱుంగక కేవల గ్రామ్యవీయలు కాకుండుటకును వారైనను సదాంధ్రమును అలవరించుకొనుటకును తగిన యేర్పాటులు చేసికొనవలయును గాని యీ గ్రామ్యాదేశ నిర్బంధము నంగీకరింపఁ గూడదు.

'కొట్టఁబడు' 'తిట్టఁబడు' అని ఈరీతిగా కర్మార్థకపడ్వాను బంధ కల్పన ఆంధ్రభాషాస్వభావాన్వనుగుణము గా దనియు ఇది వ్యాకర్తల గీర్వాణభాషామార్గానుసారి మూఢకల్పన యునియు గ్రామ్యవాదులవాదము. ఇప్పటి గ్రామ్యవ్యవహార మందు కర్మార్థక రూపములు అరు దగుట వాస్తవమే. తొల్లియు ఇవి విరళమే అయె నేని, ఈ భాషను మంచిదశకుం దెచ్చిన యా సంస్కృత విద్వాంసులు దీనియందలి యాలోపముం దీర్చుటకై, 'పొందుట' యర్థ మగు 'పడు' ధాతువును అనుబంధముగా కల్పించి పొందెడివానిం జెప్పెడి యాప్రయోగమును సాధించుట కడుం బొందికయై యాభాషాభివర్ధనుల మహిమాతిశయంబును, తద్వ్యవహారవైరళ్యము వ్యవహర్తల యజ్ఞానంబును, సూచించుచున్నవి. వ్యవహర్తలు ఇప్పటికిని 'కనఁబడు' 'వినఁబడు' ఇత్యాదివ్యవహారమును కోలుపోనేరక యున్నారు.

మఱియు, 'అంకగణిత' మనుటకు అనావశ్యక మయిన 'యరిత్థటిక్కు', సమచతురశ్ర (నలుచదుర) మనుటకు అనావశ్యక మయిన 'స్క్వేరు' అను నాంగ్లదేశములు పౌరిష్ఠత్వముం దెలుపునఁట! ఆంధ్రభాషా ధాతువులే అయిన పడ్వాద్యనుబంధములు మూఢత్వముం దెలుపు నఁట! కటకట!

ఈ కర్మార్థక ప్రయోగమును బహుళముగా చేయువారు సంస్కృతభాష పోలికలో ఆంధ్రంబున రచించువారును, ఆంధ్రభాషా స్వాభావ్యము నెఱుంగక ఆంగ్లభాషాపరిచయ బలమునం

దెలుఁగు వ్రాయుచున్న సంస్కృత గ్రంథాంగ్లగ్రంథాదాద్యంత్రీ
కర్తలును, గ్రంథకర్తృతాయశము కోరి ఇంగ్లీషులో ముందు
గా వాక్యములు రచించుకొని పిమ్మట వానిని తెనుగుపద
ములుగా మార్చుకొనువారును అగు నాధునికులుగాని, నన్నయ
తిక్కనాది ప్రాచీనులు గారు.

కలానుబంధము భవిష్యదర్థ బోధకముగా వాడుకలో
లేదనియు, తద్ధర్మార్థరూపమే భవిష్యదర్థకముగా వాడుకలో
నున్నదనియు, కలానుబంధ మిప్పుడు వాడుకలో శక్తివాచక
ముగా నున్న దనియు, ఇట్లు అర్థనులు మాఱినందున అగ్రా
మ్యము పనికి రా దనియు, గ్రామ్యవాదులు చెప్పుదురు. కలాను
బంధము ఇప్పటికిని భవిష్యదర్థకముగా "నీకు తలపొగరు ఎక్కు
వగా ఉంది తన్నగలనోయి," "రాఁగల భానువారమునాఁడు,"
"లెక్కపుస్తకాలు తేఁగలందులకు," ఇత్యాదివ్యవహారమందు
ప్రయోగింపఁబడుచున్నది. కలకు భవిష్యదర్థకత్వము గ్రామ్య
వ్యవహారమున విరళమ యయినను గ్రామ్యభాషణులు అగ్రా
మ్యములో క్రొత్తగా నేర్చుకొనెడి పెక్కు విషయములలో
నిదియు నొకటి యగుఁగాక. ఇంతమాత్రమున అగ్రామ్యభాషను
త్యజింపుఁ డనుట సరిగాదు. తాము తెలుంగును చదువమిక్కైసంత
సించుకొనుచున్న యాంగ్లోపాధ్యాయులు శిశువులకు 'బి ఏ డి
బ్యాడ్' 'ఎస్ ఏ డి స్యాడ్' చెప్పిన యనంతరము, **'I have a house'** నకు 'నేను ఒక యింటిని కలిగియున్నాను' అని అర్థము
చెప్పిన దోషంబున 'కలుగు' ధాతువునకు సకర్మకత్వము

ఆంగ్లసంపర్కంబుచే సంభవించినది, గ్రంథముల కెక్కినది ; ఇదియుం బ్రామాణిక మగును గాఁబోలు! దీనివలెనే ఆంగ్ల సంపర్కప్రతి గల యిప్పటి పండితమ్మన్యుల వ్రాతలలో ప్రచుర మగుచున్నట్టిది 'మావలనం బ్రచురింపఁబడును' ఇత్యాదిరూప మున కర్తృప్రయోగమందు 'చేతకు' బదులుగా దాఁపరించిన 'వలన'యు గ్రామ్యవాదులకుం బ్రామాణికంబ యగును గాఁ బోలు! లేదా, అగ్రామ్యమును త్యజించుటకు ఇదియు నొక కారణ మయిన నగును గావలయు!

ప్రతిగ్రామ్యమును సర్వజనీన మనుట సరి గాదు. గ్రామ్య ములు పెక్కుదెఱంగులు. గంజాము జిల్లా యోధ్రగ్రామ్యము, విశాఖపట్టణ రాజమహేంద్రవరాది హిందూస్థానీ గ్రామ్యము, నెల్లూరు కడప జిల్లాల శుద్ధగ్రామ్యము, మదరాసు చిత్తూరు తంజావూరు సేలము తిరుపత్తూరు మధుర తిరుచనాపల్లుల యఱవ గ్రామ్యములు, బల్లారి బెంగుళూరుల కన్నడగ్రామ్యము, కర్నూలు హైదరాబాదుల తురక గ్రామ్యము, ఇంక ధార్వాడ బెల్గాముల కన్నడ మరాటి గ్రామ్యము, ఈతూర్పునాటి మనకు గోడవలెనుండు హైదరాబాదు పశ్చిమోత్తరపు జిల్లాల గ్రామ్య ములు, ఇత్యాదులు జిల్లాగ్రామ్యములు పెక్కులు గలవు. ఒక జిల్లా గ్రామ్యము మఱియొక జిల్లావారికి తెలియదు సరిగదా, అసహ్యముగా కూడ నుండును. ఇవి గాక యిన్ని జిల్లాల నానా జాతుల గ్రామ్యములు కలవు. అందులో మనజిల్లావే అనేకములు మనకే తెలియవు.

ఈగ్రామ్య భేదములకు ఇంచుకంత తెలివిడి.—

వైదికోత్తముల గ్రామ్యము.—

'వ్రస్సారషరయ్యాశ్, యగ్యాశ్నీకి, వ్రస్సా.
వ్రేస్సారష వ్రప్షా వ్రిస్తళ్లనిండాను
వ్రోస్సారష నెయ్యిశ్ వ్రొర్లుచారలనిండ, వ్రస్సా.'

'పిల్లమాటకి ఏమంచావు? వారే వొచ్చి మాట్లాడు చారంచావా? నీవే మంచావు? నన్ను పుచ్చుకోమంచావా?' ఈచావంతయు పెండ్లికిఁజుమా.

కావ్యపాఠగ్రామ్యము:—'మన్దిః కవియశిః ప్రార్థి గమిష్యామ్యపహాస్యతామ్—' కవి యశిః ప్రార్థి సఱ (లేక సన్నా) - కవి=కవులయొక్క - యశిః=కీర్తిని-ప్రార్థి సన్ను=అపేక్షించువాణ్ణి అవుకుంచున్నా, కొందఱు 'అవుకుంచున్ను అని చకారమును దంత్యీకరించి ఒత్తుదురు. మఱికొందఱు 'అవుకుంచూనూనున్నా' అనియుం జెప్పుదురు.

ఒకానొక జ్యోతిషికుఁడు కుమారునికి 'కుర్వన్తి ప్రాణసందేహం స్థానభ్రంశం ధనక్షయమ్'—ప్రాణ సందేహమ్ = ప్రాణానికి సందేహమునూనూనున్నా, స్థానభ్రంశం = స్థానభ్రంశమునూనూనున్నా, ధనక్షయం = ధననాశమునూనూనున్నా, కుర్వన్తి=చేస్తారు—అని పాఠము చెప్పుచుండఁగా విని యున్నాఁడను.

వారియింట్లో ఈరోజు వైదీకం, వీరి యింట్లో ప్రస్థం. వేయిమందికి యత్నీకృత మవుతూ వుంది– ఇత్యాది బ్రాహ్మణ సంతర్పణగ్రామ్యము ప్రసిద్ధమే గదా.

ముద్రకర్తల గ్రామ్యము:—వాడు ఉపవరం చేయించుకొని దండాలు వేసుకుంటే పునీతుడు అవుతాడు.

శుభలేఖల యాంధ్రము:–మీరు సకుటుంబ సపరివార సమేతంగా రావాలిశింది.

గొప్పవారితో భాషించు కొలఁదివారి గ్రామ్యము:– బాబూ వీషం వక్కరం వది వేమో గాని వెక్కడ చూశినా వెప్పుడు పట్టినా వెండ వెంత వెక్కువగా వున్నాది బాబూ!

ప్ర. జ్రంగంభు దేభరా జ్రంగంభు దేభరా జ్రదుభుకున్నావా? ఉ. మీాయప్పకొప్పులో కిచకిచలు (మీాయొక్క కృపవల్ల క్వచిత్క్వచిత్తనుట యఁట.)

అవధాన్లుగారు ఆత్మగౌరవమునకు లోపము రానీకుండ ఒకానొక కంసాలిని 'మీరు కగ్గంసాలవారా?' అని యడిగిరి. అందులకు కంసాలి తుల్యముగా 'అగ్గందుకు సగ్గందేహామా?' అని యుత్తరము చెప్పెను.

సాయెబుగారు 'చెట్టుకి చూచి పిట్టకి కొట్టి దుబికీ దుబికీ శెయ్యాలా' అని పాడిరి.

నాజూకు గ్రామ్యము.–ఆపీసుగని కాష్ఠంమీద భోక్తా యింపుగా పెడితే ఘసందుగా కాల్తుంది.

ఇంగ్లీషు గ్రామ్యము.—పూర్వోక్తమే—'మాపలనం బ్రకటింపఁబడుపత్రిక.' "కొవ్వువత్తిని ఇంగ్లీషులో 'క్యాండిల్' అని పిలుస్తారు." 'నేను ఒకయింటిని కలిగియున్నాను.'— ఇట్టిదుష్ట ప్రయోగములు ఇప్పటిగ్రంథములలో ప్రవేశించియున్నవి.

మఱియు:—ఏమోయి మ్యానూ, మనిదే మయినావుందా? లేదురా, మాఫాదరుగారు ఇంకాపంపలేదు. మఱి నీవు సబ్జక్టేమయినా ప్రైవేరు చేశావా? కుంపెట్లులో ఫస్టాక్టు స్టడీచేశాను. ఒరే నీవు ఫస్టురేటు బ్రెహార్టురాముడవురా, నీవో? నీవు బ్రెక్ఫాస్టు రాముడవు గావటరా? ఒరే మీావిల్లేజికి బండీవెళ్తుందా? బుల్లక్కార్టు వెళ్లదుగాని గోదావరికెనాలుమీద బోట్లులో వెళ్లాలి. నీవెప్పుడు స్టార్టవుతావు? మండేనాడు.—ఈనాగరికులు (నాగరకు లనిన వీరికి పెడాంటి కక్కని కోపము వచ్చును గావున) ఈనాగరికులు ఇంత విశేషముగా తెనుఁగును పాణీకరించికొన్నను పాణిధాతువులనే ఇందు ధాతూకరించి కొనకనేరక తమకుం దెలియకయే అవశముగా భాషాస్వాభావ్య మహాప్రవాహమునం బడియున్నారు. ఉ. నేను గోతాను, వాడు ఈటుతున్నాడు, వీడు మిశ్చిపు మేకుతున్నాడు, నువ్వు హియ రవేమి వాడు అప్పట్నుంచీ కాలుతూవుంటే?—అని యింకనుం బ్రయోగించుటలేదు. 'నాల్ కాల్ సార్, ఒరివాల్ సార్, మియావు మియావు సార్.' అనెడి బట్లరింగ్లీషు ఇంగ్లీషులో ఎట్టిదో ఈతెలుఁగును తెలుఁగులో అట్టిదే యని చెప్పవలయునా!

ఇవి గాక—'మాకు వుండుకోబడ్డ చరాస్తిలో జప్తి కాబడ్డ పసరాలు శివాయి.' 'అందుకోసము మోశను దాఖలు చేశాము'—ఇత్యాది కోర్టు తాలూకా కచ్చేరీల గ్రామ్యము, జిల్లా గెజెటీల తెలుఁగుభాష, బైబిలు తెలుఁగు, లోనగు భేదములు పెక్కులు గలవు

మఱి జిల్లాభేదమునుబట్టి గ్రామ్యభేదములు.—విశాఖ పట్టణములో:—జుత్తు (జుట్టు) పిలక (పినక యని పామరవ్యవహారము) మీద జెల్లపిల్ల (చిన్న దెబ్బ) కొడితే కోంపడతారు (కోపపడుదురు). అచ్చెమ్మ యింట్లోనే వున్నాది; బొట్టికి పన్నెతో (దువ్వెనతో) తల దువ్వుతూ వున్నాది. మృత్యుంజీవుడికి యెంత ఆబ (తిండియాశ) రా బాబూ! చుట్టపీకకి ఒకపిసరు (రవంత) అగ్గి నిప్పు తేరా. మాకు యాటా వేయిరూపాయాలు వస్తవి. తలకి ఈపుల్ల లావు (కుంకుడుకాయ యెక్కువ). ఆకుట్టిపాడె గట్టు ఏంచేశాడురా, వాణ్ణి ఉత్తానే తిడతావు? పోరా కక్కు గట్టా.

రాజమహేంద్రవరములో మాకు నూర్రూపాయలు వస్తాయి. గాడిదలు పెద్దవిగాను తెల్లవిగాను వుంటాయి. కాకులు పెద్దవి. ఆరెంటికి తూర్పువాళ్లు ఆశ్చర్యపడతారు.

ఏలూరినుండి దక్షిణమునకు రాఁగారాఁగా గేదెలు బట్టెలుగా మాఱును, జనులు 'వెళ్లడం'మాని'పోవడం'ఆరంభింతురు. వంగవోలు చేరినప్పటినుండి మాటకు ముందు 'ఓరి నీ

పాసు గాలా' అని ముచ్చుడింతురు. నెల్లూరుజిల్లాలో అడుగు పెట్టుగానే 'ఏమిటి' 'అక్కడ' 'ఇక్కడ' 'ఎక్కడ' అనువానికి బదులు 'ఏంది' 'ఆడ' 'ఈడ' 'ఏడ' ఆరంభ మగును. నెల్లూరి వారు 'తాకబాక' అందురు; గోదావరివారిని 'ముట్టుకోక' అని 'యెగతాళి' సేయుదురు. తూర్పునాటి 'తలకాయ' నెల్లూరికి వచ్చునప్పటికి 'పండుసు' ఏలయన తూర్పునాట 'నీతలకాయ పగలా' అందురు. నెల్లూరులో 'నీతలపండు పగలా'అని తిట్టుదురు.

మదరాసు చేరగానే—మిల్లరుసూకులు పట్టుకొని నేరుగా పోతే కిందివాడలో (తూర్పుశ్రేణిలో) ఒకయింట్లో స్వదేశిగుడ్డలు అమ్ముతురు. వెలసరస మంటురుగాని జాస్తీదా. ఓరి పీనిగాళ్ళ, నిత్తాళ్ళ పొస్తుకాలు దారపోసుకుంటావేరా? ఓరి నీకు చుడుము పట్టిందేరా? డాక్టరు నడుగు మేరా మందిస్తుడు. మందేడ దబ్బా ఎళవు? సెలవుకు లే దబ్బా. ఇహోకపైత్యం(వెట్టి). అరే నీకు పిత్తంరా. వాడుదా నిన్ను పూడ మంటుడే నీపు పూడవేరా? అరే నేను కొడుతును, వాడు తిడుతుడు, ఆమీద నీపు యేడుస్తువు. మదరాసులో అప్పటమైన నూనె నావొళ్లికి కాదు ('నావొంటికి పడదు' అని రాజమహేంద్రవరమున; నా ద్రేహానికి కాదు అని నెల్లూరిలో.) నేను ఆతెరువే పోతూ వుణ్ణాను. అదంతాసరిదా! ఈగాగ్రామ్యముమాత్రం నావొళ్ల మాళదయ్యా!

మదరాసువారి 'యెళవు'స్థానములో కడపవారు మాటి మాటికి 'పాడు' శబ్దమును వ్యవహరింతురు.

కంచివారు బ్రాహ్మణోత్తములు ఇద్దఱు పొగబండిలో ప్రయాణము సేయుచుండఁగా, అం దొకఁడు తెలుఁగులో ఏమో చెప్పుం గడంగి చక్కఁగా చెప్పజాలకుండఁగా, రెండవవాఁడు ప్రవీణుఁడు, 'నన్నా పేశేదానికి వందాకా పేశవాలా, రాకపో నాకా శుమ్మూ కూశవాలా' అని చీవాట్లు పెట్టినాఁడు.

'పునుఁగుఁబిల్లి పరిమళించు' ననుటకు దాక్షిణాత్యం ద్రులు 'నమ్మకాటుపూనె మణకు మణకు మణకుతాంది' అని చెప్పుదురు.

బల్లారిబెంగుళూరులవారు పిల్లవానికి నీళ్లు తాపింతురు గాని తాగింపరు. తూర్పుసీమలో తాపించుట యనగా తన్నులు తన్నించుట.

హైదరాబాదువారు 'నేను చేయలేదు' అనుటకు 'నేను చేసిలేను' అందురు.

ఈ భేదములచేత కొన్ని సమయములలో పరిహాసమును మాత్ర మేగాక కోపతాపములును జగడములును సంభవించును.

గొల్లగుంట యనుగ్రామమువాఁడు ఛాందసుఁ డొకఁడు గొల్లవాఁడగు తహసీల్దారునితో. ఆ గుట్టు తెలియక అనాకూతముగానే కచ్చేరీలో సాక్ష్యములో 'ఆ గొల్లగుంట నన్ను వదలదు, నేను ఆగొల్లగుంటను వదలను.' అని చెప్పఁగా, తహసీల్దారు 'గుంట' యనఁగా 'పిల్ల' యని యర్థము చేసికొని

తన్ను ఆచాందసుఁడు హేళనముచేసినాఁ డని తలఁచి ఆతనిని 'సదాపశ్యన్తిపేరయ' పారుపత్తిగారు పూజారినింబోలె కడుం గడు ధిక్కరించెను.

నెల్లూరిలో తిట్టుటలోమాత్రము ఓరి బట్టా' అని బట్ట శబ్దమును వస్త్రవాచకముగా వ్యవహరింతురు. అచట గుడ్డ లన వలయును. తూర్పుసీమలో గుడ్డ లన్న పలికిమాలిన వస్త్రము లని భావమగును.

బందరు బి. ఏ. తో మదరాసులో మదరాసు బి. ఏ. విద్యార్థి 'నీబెయిను నేను ఎత్తుకపోతు' ననఁగానే, ఆ. బి. ఏ. 'ఎత్తుక పోతే చెప్పట్టుకొఁడతా' అనెను. అందుల జగడమును ఇతరులు సమాధానపఱిచిరి. మదరాసుజసుఁడు 'ఆపెద్దాయన కూతురిని కట్టుకొన్నా డ'ని చెప్పఁగా బందరాయన 'హరిహరీ! ఎంతపాపాత్ముఁ డయ్యా' అని యాశ్చర్యపడెను. నరసాపురము నుండి వచ్చినపంతులవారి తమ్ముఁడు నెల్లూరులో 'మాకు రోజూ పాలు కావాలి' అని గొల్లదానితో చెప్పఁగా, 'నీకు రోజు ఏమయ్యా బంగారువలె నున్నావే?' అని గొల్లభామ ఎగతాళి చేసినది. 'వాఁడు ఒక బీగాన్ని తెచ్చుకొన్నా డ'ని మదరాసు వాఁ డనఁగా, విశాఖపట్టణమువాఁడు తురకరాణివాసము నని యసర్థము చేసికొని 'మఱి వాణ్ని వెలేశారా లేదా? వాడి మొఖం చూడరా దయ్యా!' అని కక్కసించెను.

నరసాపురపువాఁడు మదరాసులో తమ్మునితో 'నీవు

మేడమీదికి వెళ్లి తాళం వేసి రారా' అనఁగానే మదరాసు స్నేహితుఁడు 'అక్కడ పాటకచ్చేరీనా యేమి, నేను కూడా పోయి వింటును.' అనెను.

విశాఖపట్టణమువాఁడు 'నన్ను తోలెయ్యండి' అనఁగా, రాజమహేంద్రవరమువాఁడు 'నీ వేమి పసరానివా?' అని యడిగెను. రాజమహేంద్రవరపు బ్రాహ్మణుఁ డొకఁడు 'నా కొక అమ్మాయి వుంది' అని చెప్పఁగా, మదరాసువాఁడు ఉంపుడుగత్తె యనుకొని 'చీ! చీ!' యని నిందించెను. విశాఖపట్టణమువాఁడు ఒకానొకని మరణముం జెప్పుచు 'వాఁడు గంటకొట్టినాఁడు' అనఁగా మదరాసువాఁడు అది యొక సింగారపు బూతుమాటగా భావించి 'శోభనము చేసికొన్నాఁడని చెప్పమే' అని హెచ్చరించెను. 'వాడు తీసుకొంటున్నాడ'ని మదరాసువాఁడు వచింపఁగా,'అయ్యో చస్తాడు గాబోసు పాపము!' అని ఔత్తరాహుఁడనియెను. 'మానాయనగారికి వొళ్లు యలాగున్నాది'అని విశాఖపట్టణమువాఁడడుగఁగా, నెల్లూరివాఁడు 'మానాయనగారు పోయినార'ని చెప్పెను. పులవర్తి వెంకన్నగారిచేత మందిప్పించకపోయినారా?' అని ఆయౌత్తరాహుఁడడుగఁగా, 'వారే ఇచ్చినారు ఒళ్లు కుదిరి నెల్లూరికి పోయినారు.' అని దాక్షిణాత్యుఁడు పలికెను. పోయినా రన్నమూర్ఖతకు ఔత్తరాహుఁడాశ్చర్యపడెను.

విశాఖపట్టణములో నెల్లూరిబాలుని బొబ్బిలిపంతులుగారు 'మీయన్నగా రేమి చేస్తున్నారు?' అని యడుగఁగా, 'పండు

కొంటున్నారు' అని బొలుఁ డుత్తరము పల్కెను. అంతట 'ఏ పండ'ని వా రడుగను, 'పండుకొన్నారంటే ఏం పండంటా వేమ'ని వీఁడు అడుగను, ఇది 'బలే తమాషా' ఆయెను.

మదరాసులో ఇంటి యొడయఁడు కాఁపురపు గోదావరి వానిని 'కూయకు' అనఁగా, కాఁపురపువాఁడు 'పళ్లు కాల గొడ్తాను' అని లేచినాఁడు. మదరాసులో ఆగంతుకుఁడు బొత్తి రాహుఁడు తన్ను 'రండ రండ' యని మదరాసువాఁడు గౌరవింపఁగా 'నీయబ్బ రండ, నీబాబు రండ, నీయమ్మ మొగుడు రండ, నీవు వెధవముండవు" అని గొంతుపట్టుకొనెను.

విశాఖపట్టణపుజిల్లా న్యాయస్థానము (డిస్ట్రిక్టు కోర్టు)లో నరమారణవిచారణలో సాక్షిని దుబాసి(ఇంటర్ప్రిటర్)గారు'ఆ దెబ్బ యెప్పుడు కొట్టినాడు?' అని యడుగఁగా, 'లోనిమీసాల్లో కొట్టినాడు'అని వాఁడు చెప్పెను. దుబాసిగారు ఆమాటకు వింతయైన యర్థము చేసికొని "He struck him on the male organ." అని ఆంగ్లీకరించిరి. న్యాయాధిపతి (జడ్జీ) గారు "He says 'మీశాలు', I know 'మీశాలు' means moustache; I think he means on the face." అని వచించిరి. దుబాసిగారు:—"No Your Honour, he says 'లోని' also; that changes the sense" దొరగారు:— "What does లోని mean?" దుబాసి.—"Internal." అంతట దొరగారు ఆలోచించి గ్రహించి పకపక నవ్విరి. దొరగారు.—"But

I wanted you to ask him the time." దుబాసి.—"Yes your honour." (సాక్షితో) "ఎప్పుడురా కొట్టినాడు?" సాక్షి-"నాశెప్పలే, లోనిమిసాల్లో, అంటా." లోనిమిసా లనగా రోహిణీ మృగశీర్షములు అని తెలియువఱకు విశేషవాగ్వాదంబును దొరగారికి చిరాకును దుబాసిగారికి పరాకును గలిగియుండినవి.

నేను ఈయూరికి వచ్చినక్రొత్తలో ఒక యచ్చురముద్రణయంత్రమును రు. 1600 లకు విక్రయింప సుండఁగా, దానిం గొనుటకు ఒక బ్రాహ్మణుఁడు వచ్చినాఁడు. ఆజేరము నాకుం దెచ్చినవాఁడు మఱియొక బ్రాహ్మణుఁడు, ఆంధ్ర ద్రావిడ గీర్వాణాంగ్ల భాషాధురంధరుఁ డగుట, మదరాసులో ఒక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుఁడు. ఆయన నాతో 'నాకు గానూరురూపాయ సగాయము చేయవల్యా' అని చెప్పినాఁడు. నన్ను రు. 100 లు తగ్గింపు మనియు అట్లు తగ్గించుటకు తన ప్రార్థనను కారణముగా తెలుపు మనియు ఆ యుపాధ్యాయుని భావ మని తలంచి నేను అట్లే రు. 1500 కి ఇచ్చెద నని చెప్పితిని. అందువలన ఆజేరము చెడినది. తనకు రు. 100 లు లంచము ఇయ్యవలయు నని తన భావ మని ఆయుపాధ్యాయుఁడు చెప్పువఱకు నే నెఱుంగ నైతిని

ఈతీరున గ్రామ్యము నానాకారణములచేత కఠినమై సర్వజనసుగమము కాకయున్నది. పైతరగతుల గ్రామ్యమునే

అవలంబింత మన్న 'లోనిమిూసాలు' దప్ప ఉక్తభేదము లన్నియు పైతరగతులవారి వ్యవహారములోనివే. పైతరగతివారి గ్రామ్యములో ప్రాసిన, క్రిందితరగతివారి కెట్లు తెలియును? క్రిందివారికై క్రిందితరగతుల గ్రామ్యములో గదా వ్రాయవలయును. గ్రాంథికము పైతరగతులవారికి ఎంతకఠినమో పైవారి గ్రామ్యము క్రిందితరగతులవారికి అంత కఠినమే. కావున ఎల్లవారికిని గ్రంథోపయోగము కలుగుటకై వారివారి గ్రామ్యములలో పుస్తకములను వ్రాసి ఇప్పటికి ఒక్కటిగా నున్న యాంధ్రభాషను పెక్కుభాషలుగా ముందుగా జిల్లాలసంఖ్యచేత గుణించి (నూతనభాషప్రకారము మల్టిప్లై చేసి), ఆలబ్ధమును (నూ. భా. ప్ర కారము ఆప్రాడక్టును,) జాతిగ్రామ్యభేదములచే గుణించి, ఆలబ్ధము ఎంతయో అన్ని భాషలుగా చేయవలసి యున్నది. ఇంత చేసినను కూలినాలి చేసికొనుచు సేద్యములు సేయుచు పసులం గాచికొనుచు జీవించు గ్రామ్యజనులు ఈగ్రామ్యగ్రంథములం జదువుదురా? బలాత్కార విద్యాభ్యాసన నిబంధన నెగ్గినం జదువుదు రందురేని, అప్పటికి ఏకత్వసిద్ధివలనను ప్రయాసభేదము లేమింజేసియు, ఉన్నట్టి ప్రయాస ఉపాధ్యాయోపదేశము చేత తీఱున దగుటచేతను, అగ్రామ్యగ్రంథములను చదువుటయే సుకరము.

పయిగా అగ్రామ్యమును బోధించువారు ఎల్ల జిల్లాల లోను ఉందురు. గ్రామ్యభేదముల నన్నిటిని ఎఱింగి బోధించువారు ఎటను ఉండరు. ఎల్లగ్రామ్యములను కలిపి ఒక్కటి

చేసి ఒక్క-వ్యాకరణము ఒక్క-నిఘంటువును వ్రాయనెంచుట అజ్ఞానము తెనుఁగు కన్నడము మళయాళము తులువము కలిపి ఒక్కటి సేయ నెంచుట'యే. ఇందులకై ఇట్టి ప్రయాసపడుట కన్న ఒక్కటిగానే యున్న దై ఒక్క వ్యాకరణమే కలదై ఒక్క-నిఘంటువే కలదైన యగ్రామ్యము సిద్ధ మయి యున్నట్టిది ఏల పనికిరాదు? ఇందులో ఇన్ని గ్రామ్యములలో పైతరగతుల వారి గ్రామ్యమునే నవీనమార్గరచనకు అవలంబించు నభిమాన మేల ? జాత్యాది దురభిమానము ఈ విషయమం దైనను మానరాదా ?

గ్రామ్యము పాటలచేతను సుద్దులచేతను దక్క సర్వవా జ్ఞ్యదరిద్రతం బొరసియున్న యిక్కాలంబున భావిగ్రామ్య వాజ్ఞ్యమునకై దానిని నేర్పించుట - దండనం బొందనున్న మాణవకుఁడు అరు వేడ్చుటగా - నున్నది.

గ్రామ్యపాఠకులు ఇతరవాజ్ఞ్యమునకై అగ్రామ్యగ్రం థములను పఠింపవలసియే యున్నది. తదర్థమై యగ్రామ్యలక్షణ మును నేర్వవలసియే యున్నది. కావున రెండుభాషలతో బాధ పడుటకన్న ఒకయగ్రామ్యమునే అవలంబించుట మేలు గాదా.

మఱియు ఇఁకమీఁద గ్రామ్యముననే సకలవిషయము లందును వాఙ్మయము ఉత్పన్న మగునేనియు అందు ప్రాచీ నాంధ్ర గ్రంథములు దుర్బోధము లగుటంబట్టి వానినుండి ప్ర మాణాద్యుదాహరణములు ఘటింపవు.

గ్రామ్యవాదుల కొన్ని యుక్తులు:—

(1) కవులచే అప్రయుక్త మగుట గ్రామ్యత్వాపాయతకు కారణము కాదనియు దానంజేసి అప్రయుక్తత్వము దోషము కాదని భాష్యకారులవారు అనుశాసించినారట.—

సమాధానము.— శాస్త్రకారుల యభ్యనుశాసనము సాధువులయభ్యను ప్రయోగాపూఢత యెఱుకవడనట్టిశబ్దములం గూర్చినదిగాని అపశబ్దములను గూర్చినట్టిది గాదు.

(2) మఱియొకయుక్తి.—భాష్యములో గ్రామ్య మనఁగా అసభ్యశబ్ద మనియు తత్ప్రయోగము కూడ దనియు చెప్పఁబడి యున్నదే గాని, గ్రామ్య మనఁగా, అపశబ్ద మనియు, తత్ప్రయోగము కూడ దనియు, చెప్పఁబడలేదు. కావున అపశబ్దరూపమయిన గ్రామ్యము ప్రయోగింపఁదగినదే, అని.

సమాధానము.—అపశబ్దమును భాష్యకారులవారు గ్రామ్య మని పేరొక్కనకపోయినను 'న మ్లేచ్ఛితవై నాపభాషితవై' అని యపశబ్దప్రయోగమును నిషేధించియే యున్నారు. కావున పైయుక్తి నిలువదు.

గ్రామ్యశబ్దమునకు అపశబ్దము అసభ్యశబ్దము అను రెండు అర్థములు కలవు. అందు అపశబ్దమునుగూర్చినప్రశ్నకు ఉత్తరముగా అసభ్యార్థమునుగూర్చిన వ్యవస్థం జెప్పుట బ్రహ్మాలోకజిగీషచేత వరునికి కూఁతు నిచ్చుటకు బదులుగా కలబంద నిచ్చుట వలెను, రోగశాంతికై వాఁకుడుకషాయమునకు బదులుగా చెప్పు కషాయమును ఉపయోగించుటవలెను ఉన్నది.

"కన్యాం కనకసంపన్నాం కనకాభరణైర్యుతాం
దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోకజిగీషయా."

(కన్య=కలబంచయు.)

"కర్ణికారిరసం పీత్వా
కర్ణం చిత్త్వా గుదం దహేత్"

(కర్ణికారి–వాకుడు–పాదరక్షయు, కర్ణం = చెవిని–ఎలు కచెవియాకును, గుదం=ఆసనమును–అవ్వ...కట్టును.)

(3) మఱియొకయుక్తి.—

విశ్వనాథకవిరాజు

"వాక్యం రసాత్మకం కావ్యం, దోషా స్తస్యాపకర్షకాః"

అనిచెప్పినాఁడు గావున, రసాపకర్షక మేదో అదే దోషము గాని గ్రామ్యాపదములు రసాపకర్షకములు కావు. కావున అవి దోషములు కావు. అని.—

సమాధానము.—ఆరసాపకర్షకము లేవో నిర్ణయించు పనిని ఆకవిరాజేని మఱి యేయాలంకారికుఁడేని మనకుం బెట్టి లేదు. మనతెలివి నెఱింగియే, అందఱును 'అసాధు' 'చ్యుతసంస్కార' 'శబ్దహీనా'ది సంకేతములచేత అపశబ్దమును అనఁగా గ్రామ్యమును రసాపకర్షకముగానే దోషముగానేచెప్పినారు.—

"గాణ్డీవీ కనకశిలానిభం భుజాభ్యాం
మాజఘ్నే విషమవిలోచనస్య వక్షః"

'ఆజౌ యమ హనః'— 1-3-28 'స్వాఙ్గకర్మ కాచ్చేతి' ఇత్యనుశాసనబలా దాజ్ఞాపూర్వస్య హనః స్వాఙ్గకర్మక స్యైవా

త్ర నేపదం నియతమ్ । ఇహ తు తల్లక్ష్యత మితి వ్యాకరణలక్షణ హీనతాత్ చ్యుతసంస్కారత్వమ్." అని విశ్వనాథకవిరాజు.

"'భూరిభారభరాక్రాన్త బాధతి స్కన్ధ ఏవ తే;
తథా న బాధతే స్కన్ధో యథా బాధతి బాధతే.'

అత్ర బాధతే రాత్ర నేపదిత్వా ద్బాధత ఇతి స్వ స్న బాధ తీతి."—సరస్వతీకణ్ఠాభరణే అసాధుసోపోదాహరణాది.

"తే నావై హీతి పృథి రసాధు రేవ." "కథం తర్హి 'హా పితం క్వాసి మే సుభ్ర' ఇతి భట్టిః? ప్రమాద ఏ వాయ మితి బహవః."— ఇత్యాదులు వ్యాకరణ శాస్త్రమందును గన నగు.

(4) మఱియొకయు క్తి.—

మహాభాష్యములో చెప్పఁబడిన నిషేధము యాజ్ఞికర్మ యందలి యపశబ్దప్రయోగమునకే కావున, కవనములయందు అపశబ్దములను అనఁగా గ్రామ్యములను ప్రయోగింపవచ్చును; అని.—

ఈ పన్నాగమునకు సమాధానము. కవనములయందు రసాపకర్షకత్వ హేతువుచేత అపశబ్దములకు దుష్టత్వ మని తెలిపియే యున్నారము.

నిషేధము యాజ్ఞికర్మవిషయ మైనను "ఏకః శబ్దః సుప్రయుక్తః సమ్యజ్ఞాతః స్వర్గే లోకే కామధు గ్భవతి" అను వచనము యాజ్ఞికర్మమాత్రవిషయము గాదు గదా.

5. మఱియొకయుక్తి.—సంస్కృతభాషయే పాణినికాల మునందు ఒకరూపుగా ఉండి పిమ్మట బహుతిథకాలమునకు వర రుచినాఁటికి కొన్నిశబ్దములందు వేఱురూపుగా మాఱిన దని యు, దానంజేసియే వరరుచి ఆనవీనరూపములు సిద్ధించునట్లుగా తత్సంబంధి పాణినీయసూత్రములకు సవరణగా వార్తికములు వ్రాసెననియు, అక్కడ నన్నయాదుల యాంధ్రభాషయు మార్పు లుచెంది ఇప్పటికి గ్రామ్యమయిసందున వారివ్యాకరణమును మూలం ద్రోచి ఈగ్రామ్యమునకు వ్యాకరణమును మనము రచిం చికొని దీనిని సాధుప్రయోగార్హముగా గ్రహింపఁదగుననియు, కొందఱు గ్రామ్యవాదులు వాదించుచున్నారు.

ఇందులకు సమాధానము:—వరరుచి పాణినికి అనంతర కాలికుఁడనుట యప్రమాణకము. వారు ఏకకాలమున వర్షో పాధ్యాయుని శిష్యులు. అందు మహేశ్వరవరముచే పాణిని రచించినవ్యాకరణమును ఆతనితోడి యెన్నిదినములవాదములో వరరుచి ఖండనసేసెను. అనంతరము పరమశివుఁడు వరరుచిని ఆ వ్యాకరణమునకు వార్తికములు సేసి దానిని రక్షించునది యని యాజ్ఞాపింపఁగా, వరరుచి యట్లు చేసెను. ఆవృత్తాంతము వర రుచిప్రోక్త బృహత్కథకు సంస్కృత మయిన కథాసరిత్సాగర మును రామభద్రదీక్షిత విరచితమైన పతంజలిచరితమును ఏవ మాదిగ్రంథములను పఠించినవారికి విదితము. ఇందువలన పై గ్రామ్యవాదము అసమంజస మని వేఱె చెప్పనక్కఱలేదు.

(6) 'సిద్ధిర్లోకాద్ధ్యశాస్త్ర' అనునాంధ్రశబ్దచింతామణీసూత్ర మువలన లోకప్రసిద్ధ మయినగ్రామ్యము ప్రయోజ్యమే యఁట-ఇందులకు సమాధానము.—సిద్ధి యనఁగా శబ్దసిద్ధిగాని తదీయప్రయోగార్హారూపసిద్ధి గాదు. లోకం బనఁగా బజా ఱునుం గాదు.

'లోకశ్చాన్యాదృశశ్చ నిత్యశ్చ.'

దానంజేసి, 'వచ్చు' ధాతువు లోకసిద్ధము, 'వొచ్చు' ధాతు వేని 'ఒచ్చు' ధాతువేని లోకసిద్ధములు గావు. దానికి ప్రయో గార్హారూపాపాదనరూప మయిన సంస్కారమును వ్యాకరణ శాస్త్రము చేయవలయును.

'సంస్కారార్థో నియమః'

అట్లు వ్యాకరణము సంస్కరించి, 'వచ్చుచున్నాఁడు' సాధు వని తెలిపి, 'అనియమా ద్గ్రామ్యం హి యత్త్వపభ్రంశః' అనుటచే 'వస్తాడు' అసాధు వని గ్రామ్యమని తెలిపినది.

'విరళా న్వేచోపాధికశబ్దాశ్చ ప్రవ్యాహరన్తి శబ్దజ్ఞాః
ఇహ తు ప్రవ్యాహార్యం సంకేతితసుప్రసిద్ధ మేవ పదమ్.'

(7) ప్రాకృతమువలె సర్వగ్రామ్యముగా వ్రాసినచో దోష మేమి యని యడుగుదు రేని.—ఆపక్షమున గ్రాంథికమునకన్న దీనివి శేష మేమి ? రెంటను వ్రాయుదురుగాక యందు రేని ఈ యినుమడి క్లేశ మేల ? క్లేశము వహించినను రెంటియందును ఉత్కృష్టాపకృష్ట భేదము లేనివారికి గ్రాంథికమున గ్రంథోత్పత్తి

పెక్కు-కారణములచేత నిలిచిపోవును. పయిగా గ్రామ్యభేద బాహుళ్యంబును తద్గ్రహణక్లేశబాహుళ్యంబును సంభవించును. ఇట్లు నేత కాలం గడియయుం దొలఁగించి కంప యదు చుట గాదా?

ఉత్క-ర్షాపకర్షలు లేవని గ్రామ్యవాదులవాద మయినను ప్రాకృతమును వేఱుభాషగా చేసి గ్రంథార్హాము గావించినవారే ఉత్తములకు సంస్కృతంబును నీచులకు ప్రాకృతంబు నని చేసినభాషావిభాగమువలన వ్యాకృతాంధ్రమునకు ఉత్తమత్వంబును గ్రామ్యంబునకు అధమత్వంబును అనఁగా నీచత్వంబును తప్పవు గావున, వ్యాకృతభాషారచనను అణఁగఁ ద్రొక్కి గ్రామ్యమున గ్రంథములువ్రాయుట మేపలే మని గంగి గోవును తటిమి వైచి ఎక్కడనేని మేసి లగువువేసి వచ్చెడు నని ఒకటి రెండు పది ఇరువది ముప్పది గాడిదకోమలులను కొన్ని గాడిదగండులనుం దెచ్చుకొనుట గాదా.

మఱియు ఈ గ్రామ్యగ్రంథరచనావశ్యకతాజ్ఞానార్థమై మమ్ము గ్రామ్యవాదులు బంగాళి చదువుకొం డనుచున్నారు. చిన్ననాఁటినుండి యభ్యసించుచున్న మాయాంధ్రపారాయణమే ఇప్పటికి ముగియలేదే, గ్రామ్యముకై బంగాళి యెక్కడ నేర్తుము? తెనుఁగునకు సంస్కృతము పనికిరా దఁట, బంగాళి వలయు నఁట. బంగాళమున నివసించి బంగాళి నేర్చివచ్చునప్పటికి మాతొంటిగ్రామ్యముకూడ అంతరించును. ఇక వ్రాయుట

యెక్కడ? వ్రాయుదుముపో ఇప్పటియాంధ్రు లెవ్వారను ఎఱుం గని బంగాళాంధ్రములో వ్రాయుదుము. మమ్ము బంగాళి చదువు కొండనుటకన్న మాహితోపదేశముబడి తాము మంచి తెలుఁగు లోనే గ్రంథములువ్రాసి పూర్వులవలెనే కీర్తింజెందుట న్యాయ్య మని నెయ్యనుతోను ప్రార్థనాపూర్వకముగాను హితము వెచ్చరించెదను.

క్రిందితరగతులవారి (ఈనవీనభాష ప్రకారము డిస్ట్రిక్టు క్లాసులవారి) గ్రామ్యములో మాత్రమే వ్రాయుట వారి నుద్ధరించుట యగును గదా. పై తరగతుల వారిని అధఃక రించుట యగును అను దుర్వాదమును మన మేల సరకుసేయ వలయు? పోనీ, ఎట్లయిన నక్లే వ్రాయవచ్చు నందు రేని అప్పటికి వ్యవస్థ యేమియు నుండదు. ఒక ప్రమాణము నుండదు. వ్యవస్థ లేర్పరింత మన్న ఉన్నవ్యవస్థలు చేసికొన్న పాప మేమి? మఱి పూర్వాపస్థయే గదా కాలక్రమమునం గలుగును.

సంస్కృతమును ఇం దుండి తొలగింపవలయు ననియు గ్రామ్యవాదుల యాపేక్షితము. ఆంగ్లము చేసిన పుణ్యాతిశయ మేమి? దానిని యథేచ్ఛముగా ఈనవీననిర్బంధ గ్రంథములలో చొప్పించుచున్నా రేల? తురకము చేసిన యాగము లేవి? దానిని యథేచ్ఛముగా 'జమాయింతు' రేల? గ్రామ్యము సాధువులను వెక్కిరించి వ్రాయం బనికి వచ్చిన వచ్చుఁ గాక, వేదాం తాదిశాస్త్రములకును, దేశచరిత్ర భౌతిక రాసాయనాది నూ

తనవిద్యలకును, మతమునకును, చట్టములకును, ధర్మశాస్త్రమునకును, జాత్యుచిత సంస్కారాది కర్మలకును, అసమర్థము. ఒకవేళ 'నన్నూనిన్నీలను' తుదంబెట్టినమాత్రాన సంస్కృతసాంకేతికశబ్దసమాసములు సులువగునా? ఇప్పుడు నూతనముగా వారు వారు వ్రాసియున్న వైదేశిక విద్యాప్రకరణగ్రంథముల నన్నిటిని పెక్కుగ్రామ్యములుగా మార్చి వ్రాసి మరల ముద్రింపించి ప్రకటింపవలయును. భారతాది గ్రంథవిషయము లేంకను ఆంధ్రులకు వలయునేని పెక్కుగ్రామ్యములందు గ్రామ్యభారతములు గ్రామ్యరామాయణములు గ్రామ్యభాగవతములు ఇత్యాది గ్రామ్యగ్రంథంబులు వ్రాయించి ముద్రింపించి ప్రకటింప వలయును. ఆంధ్రభాషా సాహిత్య పరిషత్తువారు తాము పూనుకొన్న యుద్యమములను మానుకొని యీనవీనోద్యమములను నిర్వహింపవలయును. ఇప్పటి యాంధ్రపండితు లందఱును పోవలయును.

ఒకరి గ్రామ్యము ఇంకొకరికి కర్ణకఠోరము గదా. శబ్దములు అవే అయినను వర్ణక్రమము భేదపడి ఆకఠోరత నొడఁగూర్చుటయుం గలదు.—

మదరాసు.	రాజమహేంద్రవరము.
ఎలికె	ఎలక
ఏనిగె	ఏనుగ
పీనిగె	పీనుగ

గాడిదె	గాడిద
కోరికె	కోరిక

ఇం దేది గ్రాహ్యేతరము ? ఈవిషయమున జిల్లాయభి మానమేల ? గ్రామ్యత్వమందు అన్నియు తుల్యములే గదా ? ఇన్నిటిలోను వేఱువేఱుగా వ్రాయుదు మేని ఒకజిల్లాబాలుఁడు మఱియొక జిల్లాలో చదువు నెడల వాని తెనుఁగునకు గతి యేమి? లేక, ముందుగా ఏ జిల్లావారు గ్రామ్యగ్రంథరచనకు దొరంకొనిరో ఆ జిల్లా గ్రామ్యమునఁ దప్ప కడమ గ్రామ్యముల యందు వ్రాయఁగూడదా ? కడమజిల్లావారిని వ్రాయనీయరా ?

నైజాము రాజ్యములోని యాంధ్రమునువదలి ఆంగ్లేయ రాజ్యములోని తెనుఁగుజిల్లాలలో అన్నింటను సామాన్యమయి యున్న గ్రామ్యమునే గ్రంథములయందు ఉపయోగింప వల యు ననియేనియు హాతమేని, ఆహాతము ఆంధ్రదేశాగ్రాహ్యత్యాగ ముచేత నధర్శమై యున్నది. హాతమునకు భయపడి అయ్యధర్మమును ఒప్పుకొన్నను, పూర్వోక్తసామాన్యముం గనిపట్టు శ్రమకన్న ఎల్లచోట్లనుం బొతప్రవచనములం దున్నట్టి పూర్వలక్షణమునే నేర్చి యనుసరించుటయే సులువు. మఱియు గ్రంథమంతయు గ్రాంథికభాషలో వ్రాసి అందులో కొంతకుమాత్రము కష్టపడి నేర్చిన సామాన్యగ్రామ్యముం బెట్టుకొనుట యందు పుచ్చుకొని బొల్లిని సంపాదించుకొనుటగా నుండును.

'ఎడ్యుకేటెడు జెంటిల్‌మెను'యొక్క 'పొలైటు స్పీచి' లోని గ్రామ్యము గ్రాహ్యమని మఱియొక బిభీషిక.—ఈ

మాట పాటిసేయఁదగినది గాదు. ఈయెడ్యుకేటెడు జెంటిల్ మెను హాణవిద్యయందు ఎడ్యుకేషన్ గలవారేగాని ఆంధ్రంబున ప్రవీణులు గారు. కావున ఆంధ్రము విషయమున వీరియపభ్రంశమును ప్రమాణీకరించుట యసంగతము. వీరు ప్రాయికముగా రెండు తెలుఁగుమాటలకు మూఁడు ఇంగ్లీషుమాటలు కలుపక నోరు తెరువలేరు. వీరియెడ్యుకేషను ఇంగ్లీషులో మార్పులేమేని చేయుటకు పనికివచ్చినదా ? ఖ్యాతివహించిన యొక బి. ఎల్ గారు అట్టివారినే ఒక ప్రొఫెస్సరుగారిని 'వా డ్డూయూ మీను? యూ మ్యాను! వెనై కేమూ, యూ వర్నా టుట్ హోమూ.' అని దబాయించుచుండఁగా వినియున్నాఁడను. వీరు యూరోపియను దొరలను ఈతూర్పు దీశ్శాలతో ఇట్లే మాటలాడునట్లు వారి యింగ్లీషును సంస్కరించుకొనునట్లు చేయరాదా ?

ఆంధ్రంబున ఎడ్యుకేషను గలవారు ఇతరులు. వారిమాటయే ఆవిషయమునం బాటింపఁదగినది. ఆభయముచేతనే ఈవాదులలో కొందఱు తమ హాణవ్యాసకములలో వారిపేరు ప్రసంగవశంబునం బోలె మాటిమాటికి తెచ్చి వారికి సహస్రనామార్చనయు తొమ్మిదవ యట్టంపుఁ బారాయణమును చేయుచున్నారు.

పండితులు సైతము ఇతరులతో అగాధ్యమ్యము భాషించుట లేదని కొందఱు అపండితులు అధిక్షేపించుచున్నారు. పండితులు వశ్యవాక్కులు, వారు సభలయందు అగాధ్యమునే

భాషింతురు, తమ్ము అపండితులు శుష్కస్తనీ కంచుకన్యాయం బున దూషింతు రని వారితో మాత్రము గ్రామ్యమునే భాషింతురు.

ఇన్ని రూపములనున్న యీగ్రామ్యంబును దినదినమును మాఱుచున్నది. నా బాల్యమందు నెల్లూరులో 'వడ్లపాతర' అను చుండిరి. ఇప్పుడు 'పాత్ర' యనువారు మెండు. అట్లే ప్రేరణార్థకముగా 'చేయించినాడు' 'ఇప్పించినాడు' 'చేయిం చలేదు' 'ఇప్పించలేదు' అనుచుండిరి. ఇప్పుడు అట్లనుటకు మాఱుగా 'చేయిచ్చాడు' 'ఇప్పిచ్చాడు' 'చేయిచ్చలేదు' 'చేయాలేదు' 'ఇప్పిచ్చలేదు' 'ఇప్పలేదు' అని వ్యవహరించు చున్నారు కావున ఇప్పటి గ్రామ్యమును త్వరలోనే మాని మరల ఇంత ప్రయాసయుం బడి గ్రామ్యతరము, అనంతరము గ్రామ్య తమము, అటుతర్వాతి గ్రామ్యములం దెల్పుటకు అగ్రామ్య భాషతో ప్రత్యయములు లేవు, గ్రామ్యములలోనే యుండు నే మో, అట్టి యాగ్రామ్యముల నవలంబింపవలసి వచ్చును.

కావున గ్రామ్యవాదుల యీకరుణ తమయందే గాని భావికవులయందుఁ గాదు, భావి పఠితలయందును గాదు. జనులు ఎన్ని గ్రామ్యములలోని గ్రంథములను చదువఁ గలరు.— ఒక్కఁడ ఏకభాషాలిపి ప్రయత్నము, ఏకభాషావాదమును అనుగృహీతము లగుచుండఁ—ఇయ్యెడ ఏకదేశమున బహు భాషాకల్పనము వాస్తవమయిన దేశక్షేమోద్యమ మెట్లగును? ఈపూనిక అగ్గిపుల్లకలిగి ఇల్లులేనివాఁ డొకఁడు అగ్గిపుల్ల లేనివా

రంపఱుసు చుట్టి కాల్చుకొందురు గాక యని ఇం డ్లెల్ల తగులఁ బెట్టుటగా నున్నది.

నిర్బంధ గ్రామ్యము పనికిరామికి ఈ చెప్పిన కారణము లన్నిటికంటెను బల్లిద మయినకారణ మిం కొకటి కలదు. అది యే దన:—

ఇది భాషమీఁదికి మాత్రమే వచ్చినదాఁడి యని పలు వురు భ్రమించుచున్నారు. ఇది అట్టిది కాదు. ఇది హిందూ మతము మీఁదికి ఎత్తివచ్చిన దాఁడి. ఇటిక యిటికగా లాగి కన్నము చేసి, ఇల్లు కొల్లఁబెట్టినట్లుగా, భాషభాషగా దేశ భాషల నన్నిటిని ఇట్లు చెఱచి మనమతమును సమూలఘాతముగా తెగటార్చునట్టి యుద్యమ మిది. అది యెట్లన.—

నిర్బంధ గ్రామ్యప్రాబల్యముచే అగ్రామ్య గ్రంథములు మూలఁబడును. మన పూర్వుల మహిమ, వారు మనకై గ్రంథ రూపమున నిక్షేపించి పెట్టి పోయిన ధర్మ నీతి జ్ఞాన విజ్ఞా నములు, వారికవనముల సొంపు, రామకృష్ణాద్యవతార మూర్తుల దివ్యచరిత్రములు, కృష్ణరాయాది మహాపురుషుల వైదుష్యాది విశేషములు, సర్వమును ఆంధ్రులకు ఇకను అబ్బనిలిబ్బి యగును. ఆపారంపరిచే ఆంధ్రులకు, గీర్వాణ గ్రంథములు కూడ మూలఁ బడును. ఇక ఆపూర్వగ్రంథములను చదువు దిక్కెవ్వరు? వాని ఫలమును పొందు పుణ్యాత్ము లెవ్వరు? ఒకటిగా నుండిన భాష ద్రవిడ కర్ణాటాంధ్ర మళయాళాది రూపమున పెక్కులయిన

పిమ్మట ఒకరిభాష యొకరికి తెలియక పోయినట్లు, గ్రామ్యా గ్రామ్యములు ఇప్పుడు ఒక్కటిగానే యున్నను కాలక్రమమున విశేషముగా భేదపడి వేఱుభాష లగును. ఆంధ్రులు కురళు మణిమేఖలా కంబరామాయణములను చదువుచున్నారా ! 'దాని కేమి ? ఆంగ్లేయుల యిప్పటిభాషకును బైబిలుభాషకును భేద మున్నను వారు బైబిలు చదువుచుండుట లేదా ? అట్లే మీబాలురను మీయగ్రామ్యగ్రంథములను చదువుదురు.' అని గ్రామ్యవాదులు ఓదార్పం గడంగుదు రేని, అందులకు ఉత్తరము.—మా బాలురను కొట్టి వారిచే బైబిలును చదివించుచున్నారు, తెనుఁగులో సున్న వచ్చినను పైతరగతిలో చేర్చుకొందురు. బైబిలులో కొఱవడినచో లంగరు వేయవలసినదే. మా బాలురకు ఆ బైబిలునకే అవకాశము చాలకున్నదే, ఇఁక మా యగ్రామ్య గ్రంథములు చదువుటకును చెప్పించుకొనుటకును అవకాశ మెక్కడిది? విద్యాశాలలలో అగ్రామ్యముం జెప్పునట్టి యీ కాలమందే అవి మూలఁబడి యసడ్డపాలై యున్నవి; ఇఁక వానిని చెప్పుట మానివేసినపిమ్మటను, వానికి బదులుగా తదవకాశము తప్పునట్లుగా గ్రామ్యగ్రంథములను చెప్పుచుండుటచేతను, ఇఁక వాని నామరూపము లుండునా ? 'దాని కేమి? కాలేజి పరీక్షలకు అవియుం బఠనీయములుగా నుండరాదా, అందువలన వానికి నష్టిలేకుండరాదా?' అని గ్రామ్య వాదులు కన్నీళ్లు తుడుతురేమో. పైకి అట్లు కన్నీళ్లు తుడిచినను లోలోపల కాలేజిపరీక్షలకుం గూడ గ్రామ్యగ్రంథములనే

పెట్టింప కుందురా ? అంతవఱ కైనను — ఇప్పుడు కాలేజీల యందు తెనుఁగు చెప్పుటే లేదు. క్రింది తరగతులలో సాహిత్య వ్యాకరణా ద్యుపకరణములు అలవరించుకొన్న కాలమందే కాలేజీవిద్యార్థులు తెనుఁగుభాషలో కాకతాళీయముగాను భాషాంతరీకరణ ప్రభావమునను పరీక్షలయందుఁ దేలుచును మునుంగుచును ఉండఁగా, క్రిందితరగతులలో అగ్రామ్యమును అందులపరికరమును ఎఱుఁగనివారు, అగ్రామ్యగ్రంథ పఠన మునకు దొరంకొన్నప్పుడు ఉప్పునీటిచేప ఆకస్మికముగా తియ్యనీటిం బడి నశించుకైవడి భంగపడుదురేగాని, అగ్రామ్య ప్రబంధములను బఠించి గ్రహించి తదీయవ్యాకరణాదికము నెఱింగి సాధింతు రనుట నమ్మరాని మాట. పరీక్షలయందు చిత్రకారణములచేత జయమొందిన నొందుదురు గాక,ఆచిత్రములవలన విద్య యబ్బునా ? వ్యాసరచనకై ప్రొరతనమువారు 100 కి 50 సంఖ్యలకు తక్కువ గాకుండ జయముకై నిర్ణయించినారు. సంస్కారము కలిగిన పూర్వదినములలో ఆపత్రికకు నూటికి 35 మాత్రమే వలసియుండినది. అప్పుడు సరాసరి నూటికి 40 వచ్చుచుండెనేని సంస్కారము లేని యీదినములలో 100 కి 20 యో 10 యో గదా వచ్చును. పూర్వము ఆసంస్కారాదికమునకు వారమునకు 5 దినము లుండినవి. ఇప్పుడు హెచ్చు సంఖ్య వలయును గాన 2 దినములే కలవు. అం దొకటి వ్రాతదినము, కాన బోధన దిన మొకటియే. ఆయొకదినమునుగూడ మానినను మానుదురు గాక, సంవత్సరము పొడుగునను వ్యాసరచనను

అభ్యసింపకయే యుందురు గాక, పరీక్షలో మాత్రము 100 కి 90 గురో 80 గురో జయ మొందక మానరుగదా. అట్టివారికై కాలేజీయాంధ్రగ్రంథములును గ్రామ్యములే కావలసివచ్చును. అటుపైని అగ్రామ్యవాఙ్మయముయొక్కరయము నిరయమునకే గదా.

మఱియు ఇప్పటి కింకను రాజ్యవిద్యాంగములో అబలాత్కారవిద్యయే గాని బలాత్కార విద్య లేదు. ఇంకను బలాత్కార విద్యానిబంధనము వచ్చునేనియు దానితోడ ఈనిర్బంధ గ్రామ్యము కూడునేనియు అనాదిసిద్ధాస్మదాంధ్రవిద్యారామము మీఁదికి దావాగ్నియు గాడ్పును లేచినట్లె గదా యగును.

ఈయెరగలికవులల ప్రభావంబున అగ్రామ్యవిద్యకును సంస్కృతభాషకును పునాదులయిన గ్రంథముల పఠనమునకును వేదాధ్యయనాదికమునకును బాల్యమునందు అవకాశము ఆకాశమే యగును

కావున ఈ నిర్బంధగ్రామ్యము మన హిందూమతమునకే హిందూదేశబహుకాలసంచిత ప్రాచీనగౌరవమునకే మన యాత్మగౌరవమునకే కాళరాత్రియని యెఱుంగఁదగును అంతర్యామికి అదియే ఈప్సితమాయె నేమో? ఈనిర్బంధగ్రామ్యము మన మతనౌకక్రిందఁ దూఱిన టార్పిడో; లేదా, దానిక్రిందఁ బొడిచిన చిన్నబొక్క, క్రమక్రమముగా పెద్ద దగునది. మన మత మనుకుమ్మరయావములో వైచిన గ్రచ్చకాయ. ఇది చల్లనికత్తి. తియ్యనివిషము.

గ్రామ్యదేశనిరసనము.

ఈ గ్రామ్యభావ కాలకూటము మీ శివోద్యమముచే రూపుమాయుడు, ఆంధ్రభాషోజ్జీవనామృతమును సుమనసులకు ఒడఁగూర్చుటకు శ్రీమత్కేశవాదులే దక్షుఁడు. కావున తదీయ కరుణార్ద్రకటాక్ష పూర్వకముగా ఆంధ్రమహాజనులు దొరతన మువారికి విన్నవించుకొని యీ నిర్బంధగ్రామ్యమును వెంటనే తొలఁగించి మఱి తలచూపకుండఁ జేసికొనవలయు ననియు హైస్కూళ్లు ఫారములకును ఇంటర్మీడియేట్ బి. ఏ. పరీక్షలకును ఏదేనొక దేశభాష (వర్నాక్యులరు) మునుపటివలె అవశ్యపఠనీయముగాఁ జేయించుకొనుఁడనియు మహాజనుల కెల్లమదీయవిజ్ఞాపనము.

సంపూర్ణము.

చంద్రికాప్రెస్సు, చాకలపేట, మదరాసు. సెప్టెంబరు 1940.

Blank Page

వేంకటరాయశాస్త్రులవారి యుపన్యాసాదికములు

తిక్కనసోమయాజి విజయము

విమర్శవినోదము

గ్రామ్యభాషాప్రయోగనిబంధనము

విసంధివివేకము

ఆంధ్రప్రసన్నరాఘవనాటకవిమర్శము

భారతాభారతరూపక మర్యాదలు

ఆంధ్రగ్రంథవిమర్శనప్రకాశలేశము

గ్రామ్యాదేశనిరసనము

శ్లేషవినోదము - ఆంధ్రమున స్వరసంధ్యాది - యతి ప్రాసలు - ఆంధ్రమున కవనకళాపరిణామము - అముద్రిత గ్రంథచింతామణి యందలి వ్యాసములు - ఆంధ్రభాషా సర్వస్వాపహ్నానియమ కతిపయములు. శ్రీమత్ పీఠికాపుర మండలేశ్వర ప్రవర్తిత నిర్వాణాంధ్రభాషాసర్వస్వాభిధాన మహాభిధాన సముచితనియమకతిపయములు. ఇత్యాదులు పెక్కులు అచ్చుగుచున్నవి

వేంకటరాయశాస్త్రులవారిభాషాసేవయనుపుస్తకము ఉచిత

Check List

Book Number	CPO47199	Date	17-6-20
Front Cover	YES	Back Cover	YES
Blank Pages	CT, B, XL		
Missing Pages	NO		
Prepared	K. Aruna	Scanned	Jeeva
PS		Pages	57